

15 అడుగుల కొండచిలువ హతం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలోని ఇందిరమ్మ కాలనీ శివారు పొలంలో స్థానికులకు కంటబడిన 15 అడుగుల కొండచిలువను హతమార్చారు. స్థానికులు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీని ఆనుకొని ఉన్న పొలంలో పని చేస్తుండగా 15 అడుగుల కొండచిలువ తాసరపడింది. దీంతో హతమార్చినట్లు వారు తెలిపారు. కొంత కాలంగా ఈ ప్రాంతంలో కోళ్లను తినేస్తుందని తెలిపారు.



హతమైన కొండచిలువను చూపుతున్న రైతు

ఇదేం మద్య నిషేధం..?

- ఇబ్బడి ముబ్బడిగా కొత్త బ్రాండ్లు - వీధికొకటి పుట్టుకొస్తున్న బెల్టుషాపులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దశల వారీ మద్య నిషేధం నేతి బీర చందంలా మారింది. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్.జగన్ అనేక హామీలు ఇచ్చారు. ఆ హామీల్లో దశల వారీ మద్య నిషేధం కూడా ఒకటి. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు పెంచుతున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో మద్యం అమ్మకాలు మాత్రం ఎక్కడా తగ్గలేదు. గతంలో మాదిరిగానే సాగాయి. పైగా ధరలు పెంచడం వల్ల మందుబాబుల జేబులకు మాత్రం చిల్లులు పడ్డాయి. రాష్ట్ర ఖజానా ఆదాయం మాత్రం మద్యం ద్వారా ఏటా పెరుగుతూనే ఉంది. ప్రయివేటుకు బదులు ఇప్పుడు నేరుగా ప్రభుత్వమే మద్యం అమ్మకాలకు దిగింది. కొత్త కొత్త బ్రాండ్లను తీసుకొచ్చింది. బెల్టుషాపులు లేవని చెబుతున్నప్పటికీ ప్రతి పల్లెలో మందు పుల్లుగా దొరుకుతోంది. అయితే కోరుకున్న సరుకు కాకుండా ప్రభుత్వ షాపుల్లో అమ్మే మందే పల్లెల్లోనూ దొరుకుతోంది. మందుబాబుల రక్తాన్ని పీల్చేస్తున్న ప్రభుత్వానికి తోడు.. పల్లెల్లో బెల్టు షాపులు నిర్వాహకులు మరో రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. గతంలో రూ.50, రూ.60కి దొరికే చీప్ లిక్కరు క్వార్టర్ సీసా తాజాగా రూ.150కి చేరింది. అదే సీసాను బెల్టు షాపుల్లో రూ.200 నుంచి రూ.250కి అమ్ముతుంటున్నారు.

తెరపైకి కొత్త బ్రాండ్లు..

గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండేవి. గుడి, బడి, ఇళ్లు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడంతో మద్య నిషేధం కోసం మహిళలు అనేక పోరాటాలు చేశారు. దీంతో ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా దశల వారీగా మద్య నిషేధం కోసమని జగన్ నూతన మద్యం పాలసీని తెరపైకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ప్రభుత్వమే నేరుగా మద్యం అమ్మకాలను ప్రారంభించింది. బార్లు మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు అనుమతులు ఇచ్చింది. 2019 సెప్టెంబరులో ప్రభుత్వం మద్యం షాపులు ఏర్పాటు చేసింది. మద్యం నియంత్రణలో భాగంగా మద్యం షాపుల్లో తగ్గించామని చెబుతున్నారు. 2019 నుంచి మద్యం అమ్మకాలను వైసిపి ప్రభుత్వం ప్రారంభించింది. అప్పటి వరకు ఉన్న బ్రాండ్లన్నీ మాయమైపోయి ఎన్నడూ చూడని బ్రాండ్లు తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ మద్యం షాపులకు వెళ్లి ఫలానా మద్యం కావాలనే పరిస్థితి పోయి ఫలానా ధర ఉన్న మందు కొనాలనే పరిస్థితి వచ్చింది,

మద్యం ధరలు ఒక్కసారిగా పెరగటంతో జేబులు గుల్ల



అవుతున్నాయని అభిప్రాయం మందు బాబుల్లో వ్యక్తమవుతోంది. క్వార్టర్ బాటిల్ గతంలో ఎంఆర్‌పి రూ.130 ఉండగా ప్రస్తుతం ఎంఆర్‌పి రూ.200 చేరింది. వైన్‌షాపుల్లో రూ.200 చొప్పున అవుతుండగా బెల్టు షాపుల్లో రూ.230, బార్లలో రూ.260 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. బీర్ల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఎంఆర్‌పి రూ.120 ఉండేది. ప్రస్తుతం ఎంఆర్‌పి రూ.200 నుంచి 220 కి చేరింది. బెల్ట్ షాపుల్లో రూ.280 చొప్పున విక్రయిస్తున్నారు. బార్లలో రూ.300 వసూలు చేస్తున్నారు.



ప్రజలకు కరపత్రాలను అందించి అవగాహన కల్పిస్తున్న సిపిఎం నాయకులు

4న సిపిఎం ధర్నా

కరపత్రం ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 4న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం సమర భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వై.జంక్షన్ సమీపంలోని రైతు బజారు వద్ద ప్రజలకు కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని ఆరోపించారు. నాలుగేళ్ల పాలనలో ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేయడమే కాకుండా ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, ఫిక్సడ్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ తదితర పేర్లతో రెట్టింపు భారాన్ని ప్రజలపై విధిస్తున్నారన్నారు. మరోవైపు పాలకులు వేస్తున్న అధిక ధరలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చేనాటికి కేవలం రూ.450 గ్యాస్ సిలిండర్ ధర ఉండేదని, దశల వారీగా పెంచుతూ రూ.1200 చేర్చారని తెలిపారు. తాజాగా కంటితుడుపు చర్యగా రూ.200 తగ్గించి ఎన్నికలలో లబ్దిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పాలు, బియ్యం, పప్పు దినుసులు ఇలా అన్ని రకాల ధరలు నింగిని తాకుతున్నాయని అన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఆచరణలో ఘోరంగా విఫలమైందని అన్నారు. కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. ఒక్క రైల్వే లోనే రెండు లక్షల యాభై వేల ఉద్యోగాలు ఖాళీలను, రాష్ట్రంలో గ్రూప్ 1, గ్రూప్ 2 ఖాళీలు తక్షణమే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. అదాని, అంబానీ వంటి బడా కార్పొరేట్లు, బడా పెట్టుబడి దారుల ప్రయోజనాల తప్ప దేశ ప్రజల కష్టాలను పట్టించుకోవటం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజులలో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసస్తూ ఈ నెల నాలుగో తేదీన రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, పోలిన.వెంకటేశ్వరరావు, ఐ.సుబ్రహ్మణ్యం, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

దళితుల భూములను ఆక్రమించుకోవాలని చూస్తే తరిమి కొడతాం

ప్రజాశక్తి-పెరవలి

దళితుల భూములను పెత్తందారులు ఆక్రమించుకోవాలని చూస్తే తరిమికొడతామనిసిపిఎం తూర్పు గోదావరి జిల్లా నాయకులు జువ్వల రాంబాబు హెచ్చరించారు. మండలంలోని "కానూరు అగ్రహారం"లో తరతరాలుగా పట్టాలు కలిగి లంక భూములు సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న దళితుల భూముల్లో స్మశానవాటిక కోసం భూమి ఇవ్వాలని గ్రామ పెత్తందారు చేస్తున్న ప్రచార నేపథ్యంలో దళితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జువ్వల రాంబాబు ఆదివారం ఉదయం కానూరు అగ్రహారం ఏటిగట్టు దిగువన ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తరతరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న దళిత కుటుంబాలతో.ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజికవర్గానికి చెందిన పూర్వీకులు లంక భూముల కోసం అనేక పోరాటాలు చేసి లంకభూములను సాధించుకున్నారని అన్నారు. గ్రామంలో 70 దళిత కుటుంబాలు సొసైటీగా ఏర్పడి ప్రభుత్వ పట్టాలు కలిగి సాగు చేసుకుంటున్నారని అన్నారు. అయితే ఆ భూములను కబ్జా చెయ్యాలని కుట్రతో గ్రామానికి చెందిన పెత్తందారు స్మశానానికి ఆ భూమి తీసుకుంటున్నట్లు ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారంతో దళితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. 1982లో సిసిఎఫ్ సొసైటీ ఇచ్చిన భూమి 65-08 ఎకరాలని, గోదావరి వరదల కారణంగా నదీ గర్భంలో కొంత భూమి కలిసిపోగా, ప్రస్తుతం 26-19 ఎకరాలు మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. ఆ భూమినే 70 మంది దళిత కుటుంబాలకు యం:0-



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు జువ్వల

73 సి క్లాస్ పట్టాలు మంజూరు చేశారని వివరించారు. ఈ పర్యటనలో కరిశవు సూర్యారావు, గమనియేలు, బి.జోగయ్య దేవిడ్, పాల్గొన్నారు.

'టిటిడి నుంచి నిధులు రాబడతా'




భూమి పూజ చేస్తున్న ఎంపి భరత్

ప్రజాశక్తి - నల్లజర్ల

కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను టిటిడి నుంచి రాబట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నల్లజర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ శంకుస్థాపనలో కొబ్బరి కాయ కొట్టి హోమాది క్రతువుల్లో పాలొన్నారు. ఈ సందర్భంగా ఎంపి భరత్ మాట్లాడుతూ రూ.7 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆర్థిక సహాయం అందేలా టిటిడి ఛైర్మన్, ఈవోను కోరతానని చెప్పారు. టిటిడి శ్రీవారి ఆలయ నిర్మాణాలకు, ఆలయ పునర్నిర్మాణాలకు వేల కోట్ల రూపాయలు ఇస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు వేద పండితులు ఎంపి భరత్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, టీటీడీ బోర్డు డైరెక్టర్ నాగ సత్యం తదితరులను శాలువా కప్పి వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు జి.శ్రీను, కారుమంచి రమేష్, ఎం విజయలక్ష్మి, ఆలయ ఛైర్మన్ రాయుడు విజయ్ కుమార్, ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షలు అందజేసిన దాత ఈ వీర వెంకట వినోద్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కఠోర కృషితో విజయ సోపానాలు

ప్రజాశక్తి - కడియం

గొప్ప వ్యక్తిత్వం, కఠోర కృషి ఉన్నవాళ్లు ఎప్పుడూ జీవితంలో విజయ సోపానాలు అందుకుంటారని కడియం సిఐ పివిజి తిలక్, బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించి, జైలు శాఖ డిఎస్‌పిగా ఉద్యోగం సాధించిన చుక్కల సూర్యకు మార్‌ని బాధ్యత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. కడియంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చుక్కల రమణ కుమారుడు సూర్య కుమార్ ఈ విజయం సాధించడం పట్ల ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు అభినందించారు. కానిస్టేబుల్ రమణ కుమారుడు డిఎస్పీగా, మరో కుమారుడు గోవిందరాజు ఢిల్లీ ఎయిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా, కుమార్తె స్వాతి కూడా గతంలో ఇంటర్మీడియట్ ఆల్ ఇండియా టాపర్‌గా ర్యాం కులు సాధించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. జడ్‌పిటిసి మాజీ సభ్యులు దొంతంశెట్టి చిన్న వీరభద్రయ్య, కడియపు సావరం సర్పంచి మురళి, ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, దుల్ల సర్పంచ్ పట్టియ్య, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, అగ్రికల్చర్ ఛైర్మన్ ఈలి గోపాళం, తదితరులు మాట్లాడారు. హెడ్ కానిస్టే బుల్ రమణ, ఆయన సతీమణి లక్ష్మి వ్యక్తి త్వాలే పిల్లల విజయానికి మార్గద ర్శాలయ్యాయన్నారు. అనంతరం సూర్య కుమార్, ఆయన తల్లిదండ్రులు రమణ, లక్ష్మిలను ఘనంగాసత్కరించారు. ఈ కార్యక్రమంలో కడియపులంక మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, పోలీస్ అధికా రుల సంఘం నాయకుడు రఘురాం, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచం ద్రరావు, వైసిపి నాయకులు ఊటు కూరి శైలజ, కానుబోయిన సాగర్, బత్తుల రాము, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, గుత్తు ల హరిప్రసాద్, సూరపరెడ్డి జానకి రామయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, నర్సరీ సంఘం నేతలు పల్ల సుబ్రహ్మణ్యం, మార్ని జానకిరామ్, మార్గాన్ని ఏడుకొం డలు, చెళ్ల పిళ్ల కమిటీ సభ్యులు చిక్కాల ఈశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు ఉంగరాల వీరభద్ర రావు, జెవివి నాయకు లు గండి స్వామి ప్రసాద్, భగత్ సింగ్ కమిటీ నాయకులు తమ్మిశెట్టి ప్రసాద్, గాయత్రి బ్రాహ్మణ సంఘం నాయకులు, వేదాంతం నాని తదితరులు పాల్గొన్నారు.



డిఎస్‌పిగా ఉద్యోగం సాధించిన సూర్యకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

మంత్రి 'కారుమూరి'కి సత్కారం

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఇటీవల కాలంలో నిర్మించిన శ్రీకష్ణుని ఆలయాన్ని ఆయన ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రిని శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆలయ పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసు, కమిటీ సభ్యులు వంటపాటి కష్ణమూర్తి, పాశం రామకష్ణ, గాలి శ్రీనివాసు, నాగళ్ల బాపూజీ, వి.గోవిందు, మట్టా ఆంజనేయులు పాల్గొన్నారు.



మంత్రిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దండయాత్రగా మార్చకండి : మద్దిపాటి

ప్రజాశక్తి-నల్లజర్ల

టిడిపి నేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను సజావుగా సాగనివ్వాలని, దాన్ని దండయాత్రగా మార్చొద్దని టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్ ఛార్జి మద్దిపాటి వెంకటరాజు వైసిపి శ్రేణులకు హితవు పలికారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికే యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లజర్ల మండలంలో ఈనెల 1న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంలో తిమ్మనపాలెంలో చోటు చేసుకున్న ఫ్లెక్సీ వివాదంపై లోకేష్, యువగళం టీం, టిడిపి నాయకులపై నల్లజర్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు తెలుస్తుందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను వ్యంగంగా చిత్రీకరిస్తూ అవమానపరిచే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దానికి పోలీసులే రక్షణ కవచంగా ఉండటం సరికాదన్నారు. తమ పార్టీ నేత పాదయాత్రను కొనసాగనివ్వండి..దాన్ని దండయాత్రగా మార్చవద్దని హెచ్చరించారు. ఈ విధమైన కవ్వింపు చర్యలు చేస్తు రెచ్చగొట్టేలా వివాదస్పద ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే వాటిని ముందస్తుగా తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమవేశంలో మాట్లాడుతున్న వెంకటరాజు

15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు తిరుపతిరావు, నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం యూనియన్ అధ్యక్షులు శేషుకుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20 వేల లోపు ఉన్న బాధితుల్లో కొందరికి తమ పోరాటానికి దిగివచ్చి చెల్లింపులు జరిగాయన్నారు. అయితే ఇంకా మూడున్నర లక్షల మంది బాధితులకు డబ్బులు రావాల్సి ఉందని తెలిపారు. గత నాలు గున్నరేళ్ల కాలంలో అగ్రిగోల్డ్ సమస్యని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాలికి వదిలేయటం న్యాయం కాదని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు టిడిపి అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు మాయమాటలు చెప్పి మోసం చేశారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల అనంతరం టిడిపి అధికారంలోకి వస్తుందని, అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. యువగలం పాదయాత్ర రాజమహేంద్రవరం నగరానికి త్వరలోనే చేరుకుంటుందని, ఆ సమయంలో అగ్రిగోల్డ్ బాధితులతో లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు అన్ని రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టేందుకు ఈ నెల 15న విజయవాడ జింఖానా గ్రౌండ్లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, అసోసియేషన్ నాయకులు తులసి రెడ్డి, బిజెపి నాయకుడు కాలెపు సత్య సాయి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ అగ్రిగోల్డ్ బాధితుల నాయకులు సురేష్, లోవరత్నం పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత ఆదిరెడ్డి వాసు

ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి - చాగల్లు

హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఆగస్టు 8వ తేదీ నుంచి చేపట్టిన నిరవధిక సమ్మెకు తమ మద్దతు ఇస్తున్నట్లు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె. పోశమ్మ తెలిపారు. స్థానికంగా జరిగిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హర్యానా రాష్ట్రంలో ఆశా వర్కర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులపై దారుణంగా లాఠీఛార్జీ చేయడమే కాకుండా అరెస్టు చేశారని అన్నారు. మహిళలైన ఆశ వర్కర్లు పట్ల హర్యానా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన ఆశా వర్కర్లకు కనీసం మంచినీరు ఇవ్వకుండా, టాయ్ లెట్ సౌకర్యం కల్పించకుండా హింసించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకొని ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆశ వర్కర్లు మెయిల్ ద్వారా వినతి పత్రం పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, అన్నామని, కస్తూరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటికీ జనసేన మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని దుద్దుకూరు గ్రామంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు సంబ శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటికి జనసేన మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంట్రపాటి రాజు, నియోజవర్గ నాయ కులు దొడ్డిగర్ల సువర్ణ రాజు పాల్గొని గ్రామంలో ప్రతి ఇంటికి జనసేన పార్టీ సిద్ధాంతాలను, పార్టీ మినీ మేనిఫెస్టో ముద్రించిన కరపత్రాలతోపాటు మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.



పార్టీ మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందిస్తున్న జనసేన నాయకులు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భూమి పూజ జరిగింది. ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి కొబ్బరికాయ కొట్టి, నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని నిర్మించు కోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో కమిటి సభ్యులు గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని శ్లాఘించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా టిటిడి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, కన్వీనర్ దూలం పెద్ద, జెడ్పిటిసి పెద్ద వెంకన్న, పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విజయలక్ష్మి

నేరాలు ఘోరాలు

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను అర్ధరాత్రి సమయంలో అపహరించుకుపోతున్న దొంగలను సిసి కెమెరాల ఆధారంగా ఇంద్రపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కొంతకాలంగా ఇంద్రపాలెం, చీడిగ, రేపూరు, కొవ్వాడ గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. చోరీ చేసిన మోటార్ సైకిళ్లను ఆదివారం తెల్లవారుజామున కాకినాడ మెయిన్ రోడ్డులోని మార్కెట్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణ చేపట్టి నిందితులపై కేసును నమోదు చేసి కఠినంగా చర్యలు చేపట్టాలని బాధితులు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పోలవరం కాలువలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరం గ్రామంలో పోలవరం కాలువ పంప్ హౌస్ లాకుల వద్ద ఆదివారం ఒక మహిళ మృతదేహం లభ్యమయింది. కిర్లంపూడి ఎస్ఐ ఉమా మహేశ్వరరావు తెలిపిన వివరాలివి. బూరుపూడి గ్రామానికి చెందిన కరణం రమాదేవి (26) భర్త మద్యానికి బానిసవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందన్నారు. రమాదేవికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమాదేవి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



ధ్వంసమైన బోటు

రాళ్లను ఢీకొని బోటు బోల్తా...

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

అమీనాబాద్ రేవు వద్ద రాళ్లను ఢీకొని బోటు బోల్తా పడడంతో బోటు ధ్వంసమై సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బోటు యజమాని తెలిపారు. ఉప్పాడకు చెందిన కారే చిన్నబ్బాయికు చెందిన బోటుపై శనివారం కొంతమంది మత్స్యకారులు వేటకు వెళ్లారు. వేట ముగించుకుని సాయంత్రం వచ్చి అమీనాబాద్ రేవు వద్ద బోటుకు లంగర్ వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి. బోటు మొత్తం ధ్వంసం అయి ఉంది. మినీ హార్బర్ ఏర్పాటుకు ఇటీవల సముద్రానికి అడ్డుగా రాళ్లు వెయ్యడంతో అలల ఉధతి ఎక్కువగా ఉండడంతో లంగర్ తాడు తెగి బోటు వెళ్లి రాళ్ల గట్టును ఢీకొట్టింది. దీంతో బోటు ధ్వంసమైందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ధ్వంసమైన బోటును జెసిబి సహాయాలతో ఒడ్డుకు తీసుకువచ్చారు. ఇటీవల కాలంలో అమీనాబాద్ రేవు వద్ద అలల ఉధతికి ఎన్నో బోట్లు ధ్వంసమయ్యాయి దీన్ని గమనించి బోట్లు ధ్వంసం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కాట్రేనికోన

కందికుప్ప గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారంతో ఎస్ఐ టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ.55,500 నగదును మరియు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో నలుగురు నిందితులు పేకాట శిబిరం నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఐ పోలవరం

కొమరగిరి 216వ జాతీయరహదారి పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లంక సురేంద్ర వంశీశ్రీ(21) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలుఇవి.. యానాం నుంచి బైక్ మీద ఇంటికి వెళుతుండగా కొమరగిరి ఇటుకల బట్టి సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ఆటోని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న సురేంద్ర వంశీశ్రీ మృతి చెందినట్లు ఐ.పోలవరం ఎస్ఐ సి హెచ్.రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామంలో చెరువులో ఏరియేటర్లు మరమ్మతులకు గురికావడంతో రిపేరు చేస్తున్న సమయంలో పొలం లో పని చేస్తున్న సుంకర త్రిమూర్తులు ఏరియేటర్ పైకి లేపడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి అల్లవరం పోలీసులు చేరుకుని కేసు విచారణ చేస్తున్నారు.



అదుపుతప్పి పక్కకు ఒరిగికిపోయిన ఆర్‌టిసి బస్సు

అదుపు తప్పిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-అయినవిల్లి

తొత్తరమూడి రోడ్డులో ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి కొబ్బరి తోటలోకి ఒరిగిపోయిన తొత్తరముడి లో చోటుచేసుకుంది. వివరాలు ఇవి.. మురముళ్ళ నుంచి వయా ముమ్మిడివరం, తొత్తరమూడి మీదుగా రావులపాలెం వెళుతున్న బస్సు తొత్తరమూడి వద్ద గుంతలు ఏర్పడి రోడ్డు సరిగా లేకపోవడంతో అదుపుతప్పి కొబ్బరి తోటలోకి ఒరిగిపోయింది. దీంతో కొబ్బరి చెట్లు అడ్డు రావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి





ప్రజాశక్తి-అమలాపురం

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని పంచాయితీల్లో పారిశధ్యం, తాగునీటి సౌకర్యాలు పైనే ప్రధానంగా దృష్టి సారించామని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయితీ అధికారి కృష్ణకుమారి అన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించి కొన్ని కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకంటాన్నారు.

జిల్లాలోని అన్ని పంచాయితీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, డ్రైనేజీల క్లీనింగ్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు ప్రభుత్వం 'మనం మన పరిశుభ్రత' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పై ప్రత్యేక దష్టి సారించాము. ప్రతి గ్రామంలో కూడా క్లాప్ మిత్రల సహాయంతో ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టాము.

తాగు నీటి సరఫరాపై ఎటువంటి చర్యలు చేపట్టారు.

జిల్లాలో వేసవికాలంలో తప్ప తాగునీటి సమస్య పెద్దగా లేదు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్డబ్ల్యూఎస్ సహకారంతో సిపిడబ్ల్యూఎస్ స్కీమును జిల్లాలో పలు గ్రామాల్లో అమలు చేస్తున్నాము. ఈ పథకం ద్వారానే జిల్లాలోని అమలాపురం మండలం పేరూరు చిందాడగరువు గ్రామాల నుండి పైప్ లైన్లు ద్వారా 30 గ్రామాలకు పైగా తాగునీటి ని అందిస్తున్నాం.

అలాగే పిడబ్ల్యూఎస్ స్కీం లో భాగంగా పంచాయతీలోనే మోటర్ల ద్వారా భూగర్భ జలాలు తోడుకొని వాటిని శుద్ధి చేసి త్రాగునీరు అందించడం జరుగుతుంది.గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పెద్దలు, వార్డు సభ్యుల సహకారంతో గ్రామ సభలు జరిపి జల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ త్రాగు నీటి వనరులను సంరక్షించుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. క్షేత్రస్థాయిలో త్రాగు నీటి పైపులు మరమ్మతులు, మంచినీటి పథకం ట్యాంకులు పరిశుభ్రత, త్రాగునీటి పరీక్షలు జరుపుతున్నాం. సచివాలయ సిబ్బంది ద్వారా ఇది నిరంతరంగా జరుగుతుంది.

పన్నుల వసూళ్లు ఎలా జరుగుతున్నాయి?

జిల్లాలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివద్ధికి సహకరించాలి. పన్నుల రూపేణా జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 90 శాతం పన్నులు వసూలు అయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలుకు డిమాండ్ నోటీసులు జారీ చేసే పనిలో సిబ్బంది ఉన్నారు. పన్నులను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

వీధిలైట్ల నిర్వహణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

వీధి లైట్ల నిర్వహణ పట్ల కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఫిర్యాదులు కూడా చాలా ప్రాంతాల నుండి వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వెలగడం, మరికొన్ని ప్రాంతాల్లో వెలగక పోవడం, చాలా చోట్ల వెలుగుతూనే ఉండడం వంటి సమస్యలు వస్తున్న నేపథ్యంలో స్థానిక పంచాయితీ, సచివాలయ సిబ్బందే నిర్వహణ బాధ్యతలు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం .విద్యుత్తు విడి పరికరాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది.వీధిలైట్లు సమస్యలు వచ్చిన వెంటనే పరిస్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారు.

14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి గడువుని ప్రభుత్వం మరో ఏడాది పాటు పెంచింది. 14వ ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ చేసి మళ్లీ రిలీజ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గైడ్ లైన్స్ ప్రకారం సిఎఫ్ఎంఎస్ విధానంలో ఖర్చు చేస్తాం. పంచాయితీలకు ఉన్న విద్యుత్తు బకాయిలను చెల్లించే విధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. మిగిలిన నిధులను గ్రామ పంచాయితీ అభివద్ధి ప్రణాళిక ప్రకారం త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం నిర్వహణ, సిసి రోడ్లు బరేల్ గ్రౌండ్ ల అభివద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభించిన ఆర్ఎఒ మునిస్వామి

డ్రీమ్స్ విద్యార్థుల స్వచ్ఛతా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం స్వచ్ఛతా పఖ్వాడ ర్యాలీని నిర్వహించారు. స్థానిక పరిపాలనాధికారి మునిస్వామి ఆయన కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు యానాం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం - పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శేరు వెంకట రమణ, మేనేజర్ గంగాధరవర్మ, ప్రధానోపాధ్యాయురాలు మాథ్యూస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దొరబాబు

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

కట్టమూరులోని కేశవ పట్టాభి రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పురాతనమైన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవస్థానం నిధులు రూ.10 లక్షలు, సర్వ శ్రేయోనిధి రూ.90 లక్షలు మొత్త రూ.కోటితో వ్యయంతో పునర్ నిర్మిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసిలు నల్లల సూర్య కుమారి, యు.ప్రసాద్, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆలయ చైర్మన్ మేడిది వెంకట రామారావు, చల్లా చిన్న వీర్రాజు, బిక్కిన శేషవీర కుమారి, పెద్దింటి వెంకట నరసింహాచార్యులు, ఎలిశెట్టి నాని, ఏలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్‌బి.పట్నంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నంలో వినాయకుని ఆలయం వద్ద ఆదివారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకులు ముత్యాల రాజబ్బాయి, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంద్రు సత్తిబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్య వజ్రాయుధం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, బాధ్యతగా వినియోగిస్తే సమాజానికి, భావితరానికి మేలు జరుగుతుందని యనమల రామం పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్ల వయసు నిండే యువతకు ఓటు నమోదు చేస్తున్నందున సద్వినియోగపరచుకోవాలని అన్నారు. ఓటర్ లిస్ట్‌లో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడం లేకపోతే ఓటు చేర్పించుకోవడం ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడి బాధ్యతన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యనమల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రామం



అలరించిన నృత్య నీరాజనం

అలరించిన నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చిన్నారులు చేసిన నృత్యాలతో కాకినాడ నగరం పులకించింది. సుమారు 650 మంది విద్యార్థులతో 42 నాట్యసంస్థలతో ఆనెం లక్ష్మణరావు నృత్యనీరాజనం ఘనంగా నిర్వహించారు. కాకినాడ దంటు కళక్షేత్రంలో నిర్వహించిన ఈ నృత్య నీరాజనం అలరించింది. నాట్యరంగంలో ప్రసిద్ధులైన నృత్య సమాఖ్య కాకినాడ అధ్యక్షులైన నాట్యాచార్య ఒవిఎన్.వరప్రసాద్, సేవారంగంలో ప్రపంచ తెలుగు సేన అధ్యక్షుడు పిఎస్ఎన్.మూర్తి, నాగపూర్, కళారంగానికి ప్రతీకగా ప్రముఖ రూపశిల్పి శ్రీరామును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు గట్టి సత్యన్నారాయణ, సిఎన్.మూర్తి, బుద్దాల వెంకటరామారావు, లింగమల్లు కృష్ణమూర్తిగారు తదితరులు పాల్గొన్నారు. నత్యసమాఖ్య సభ్యులందరితో కలిసి అనేక మందికి నాట్యసంస్థలకు ప్రసాద్ అభినందనలు తెలిపారు.

టిడిపిలోకి మాజీ సర్పంచ్ నారాయణస్వామి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వికె.రాయపురం మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి (రాజు) సుమారు 200 మంది తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం రాత్రి కాకినాడ రూరల్ శివారు అచ్చంపేట వద్ద టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో రాజు తన అనుచరులతో టిటిపిలో చేరారు. రాజు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో వికెరాయపురం సర్పంచిగా, సొసైటీ అధ్యక్షునిగా పనిచేశారు. గత ఎన్నికలకు ముందు టిడిపి వీడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఉన్నారు.ఠ

ఉపాధ్యాయుడు దొరబాబుకు 'మెరిటోరియస్' అవార్డు

ప్రజాశక్తి-కడియం

దుళ్ల నెంబర్-1 ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు దొరబాబు ఫిలంత్రోఫిక్ సొసైటీ ఇండియా వారు అందజేసే మెరిటోరియస్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం ఎల్ఐసి ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, కాకినాడ ఆర్‌జెడి నాగమణి, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు చేతుల మీదుగా ఈ అవార్డును దొరబాబు అందుకున్నారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల పట్ల అత్యధిక శ్రద్ధ కనపరుస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించే ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపిక చేస్తామని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఇండియా అధ్యక్షులు అద్దంకి రాజా తెలిపారు. అవార్డుకు ఎంపికైన మాస్టారును ఎంఇఒ లజపతిరాయ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరు శ్రీనివాస్ మాస్టర్, ప్రధానోపాధ్యాయుడు గెద్దం ఆనంద్, పిఎంసి ఛైర్మన్ గోపి వెంకటరామ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, దుళ్ళ గ్రామ వైసిపి అధ్యక్షులు తాతపూడి బాబి తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయుడు దొరబాబుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

ముగిసిన జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన అమలాపురం మండల స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు వేడుకలు అమలాపురం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్‌డిఒ వసంతరాయుడు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వల్ల చదువులో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అండర్-11, అండర్-13, అండర్-15 మూడు విభాగాలలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు అందరకూ ఆర్‌డిఒ అభినందనలు తెలియజేశారు. ఈ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేశారు. ఇటువంటి టోర్నీని విజయవంతంగా నిర్వహించిన కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధికారులకు, ఆఫీసర్ క్రియేషన్ క్లబ్ టీమ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మెట్ల సూర్యనారాయణ, రంకిరెడ్డి విశ్వనాథ్, రంగమణి, పి.జాన్ పాల్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, పి.రాజా, మాధవి, టి. సత్యనారాయణ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆర్‌డిఒ తదితరులు



నియామక పత్రం అందిస్తున్న జివి.శ్రీరాజ్

జాబ్ మేళాకు 700 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని రాజీవ్ గాంధీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన మేగా జాబ్ మేళ లో వివిధ కంపెనీలకు సుమారు 700 మందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు.

ఈ జాబ్ మేళాను విద్యా సంస్థల ఛైర్మన్ జివి హర్షకుమార్, టిడిపి నాయకుడు ఆదిరెడ్డి వాసు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసుత రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టతరమైనదని, అందుకే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మంచి ప్రతిభను కనబరిచి ఉద్యోగం లో పని అనుభవం సంపాందించుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా రాజీవ్ గాంధీ విద్యాసంస్థలతోపాటు జీజూమ్ సాఫ్ట్ వేర్ సొల్యుషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళలో ప్రముఖ కంపెనీలు విప్రో, గన్ ఫ్యాక్ట్, టెలి ఫేర్ఫార్మెన్స్, హైలెట్ టెక్నాలజీ, టేక్ వే సాఫ్ట్ వేర్, ముత్తూట్ గ్రూప్, త్రీజీ హైయర్ సర్వీస్, బిట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ తదితర 55 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ కళాశాల డైక్టర్లు జి.వి.శ్రీరాజ్, జివి సుందర్ పాల్గొన్నారు.



పిడుగుపాటుకు కాలిపోయిన పాకలు

పిడుగుపడి రెండు గేదెల మృత్యువాత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని అమజూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపాటుకు మూడు పాకలు పూర్తిగా కాలిపోయాయి. వాటిలో గల రెండు గేదెలు చనిపోగా, మరొక గేదె తీవ్ర గాయాల పాలైంది. ఈ పాకలు మేడిశెట్టి ప్రసన్న కుమార్, మేడిశెట్టి శివప్రసాద్‌కి చెందినవి. రామచంద్రపురం ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల30వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా.

మోటార్ సైకిల్ సీజ్.. వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మోటార్ సైకిల్ వేగంగా నడపడంతో పాటు సైలెన్సర్ లేకుండా రాత్రి సమయంలో బండిని నడిపి ప్రజలను భయభ్రాంతులను గురిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సంఘటన ర్యాలి గ్రామంలో చోటుచేసుకుంది వివరాలివి.. గ్రామానికి చెందిన మెర్ల సాయికృష్ణ శనివారం రాత్రి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా మోటార్ సైకిల్‌ను నిర్లక్ష్యంగా నడపడం, సైలెన్సర్ను తీసి వేగంగా వాహనాన్ని నడిపాడు. దీంతో సాయి కృష్ణపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహ విద్యుత్ వినియోగదారులకు, వ్యవసాయ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ(ఆపరేషన్స్) ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ చర్యల్లో భాగంగా పరి శ్రమల విద్యుత వినియోగంపై పరిమితులు విధించనున్నామ న్నారు. సెప్టెంబర్ 5 నుంచి 15 వరకూ పరిశ్రమల విద్యుత్ సరఫరాలో లోడును నియంత్రి చనున్నామని తెలిపారు. కంటి న్యూస్ ప్రాసెస్ పరిశ్రమలు వాటి కాంట్రాక్టడ్ మాక్సిమం డిమాండ్ (సీఎండీ)లో 70 శాతం మాత్రమే వాడాలన్నారు. నాన్ కంటిన్యూస్ ప్రాసెస్ పరిశ్రమలు పగలు 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకూ ఒక షిఫ్టును మాత్రమే కొనసాగించాల్సి ఉం టుందన్నారు. సోమవారం జగ్గం పేట డివిజన్, మంగళవారం కాకినాడ డివిజన్, బుధవారం, గురువారం పెద్దాపురం డివిజన్, శు క్రవారం రాజమహేంద్రవరం డివిజన్, అమలాపురం డివిజన్, రంపచోడవరం డివిజన్, శని వారం రాజమహేంద్రవరం అర్బన్ డివిజన్, రామచంద్రపురం డివి జన్‌లో లోడ్ రిలీఫ్ ఇస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరా సమాచారం మేరకు 1912, సంబంధిత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్(ఆపరేషన్)ని సం ప్రదించాలన్నారు. రాజమహేంద్ర వరం టౌన్ డివిజన్(7382299960, 9440812585), రాజమ హేంద్రవరం రూరల్ డివిజన్ (738258548, 9440812586), కాకినాడ డివి జన్(8333818099, 9440812589), పెద్దాపురం, జగ్గంపేట, అమలాపురం డివిజన్ (9440812588, 9440812587), రామచంద్రపురం డివిజన్, రంప చోడవరం డివిజన్ (7382585554) నెంబర్లను సంప్రదించాలన్నారు.